సాక్షి
కామారెడ్డి
గురువారం । 25 । జులై । 2024



ప్రమాదకరంగా కల్వర్టు
గజ్యానాయక్ తండా చౌరస్తా -ముస్తాబాద్ రోడ్డులో నిర్మించిన కల్వర్టు గుంతలతో ప్రమాదకరంగా మారింది.
- 9లో ▸



పాత ఏజెన్సీలకే..
వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రులలో వివిధ విభాగాల కాంట్రాక్ట్‌ను సర్కారు మరో ఏడాది పొడిగించింది.
- 8లో ▸



గరిష్టం/కనిష్టం
30.1 /22.3

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రాజు తెలిపారు. ఆసక్తిగలవారు సెప్టెంబర్ 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హెచ్‌సీఎల్ టెక్‌బీకి..

కామారెడ్డి అర్బన్: హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాంలో భాగంగా డీపీవో(డిజిటల్ సపోర్ట్ అసోసియేట్) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి ఆర్. రాజేష్‌కుమార్ తెలిపారు. 2023-24 సంవత్సరంలో 75 శాతం మార్కులతో ఇంటర్(సీఈసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూప్‌లతోపాటు ఒకేషనల్ కోర్సులు) పూర్తి చేసినవారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 80740 65803, 97016 65424 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

కూలిన ఇల్లు



మాచారెడ్డి: వరుసగా కురుస్తున్న వర్షాలతో సోమారంపేటలో మంగళవారం ఓ ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన ఆనంద్‌రెడ్డి కుటుంబం కామారెడ్డిలో నివసిస్తోంది. ఆనంద్‌రెడ్డి మాత్రం పాత ఇంటిలో ఉంటున్నారు. మంగళవారం ఆయన లేని సమయంలో ఇల్లు కూలిపోయింది. దీంతో ప్రమాదం తప్పింది.

పెచ్చులూడిన పైకప్పు



పెద్దకొడప్‌గల్: వర్షాలతో మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రం పైకప్పు దెబ్బతింది. మంగళవారం పైకప్పు పెచ్చులూడి కిందపడింది. ఆ సమయంలో సిబ్బంది, రోగులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

తాడ్వాయిని సందర్శించిన యునిసెఫ్ సభ్యులు



తాడ్వాయి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని బుధవారం యునిసెఫ్ ప్రతినిధులు సందర్శించారు. అన్ని గ్రామాల సమాఖ్య అధ్యక్షురాళ్లతో మాట్లాడారు. మాతాశిశువుల ఆరోగ్యం కోసం తీసుకుంటున్న జాగ్రత్తలపై చర్చించారు. సంఘాల ద్వారా రుణాలు తీసుకొని తాము ఆర్థికంగా ఎదిగినట్లు మహిళలు వారికి చెప్పారు. డీపీఎం రమేశ్‌బాబు మాట్లాడుతూ కిచెన్ గార్డెన్, మహిళా శక్తి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో యునిసెఫ్ ప్రతినిధులు జిలలన్ జాఫర్, రేఖ, ఖైరీ, సుబ్బారావు, నర్సింహారావు, ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.

'ఇంటింటా ఇన్నోవేటర్' పోస్టర్ ఆవిష్కరణ



నాగిరెడ్డిపేట: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో కలిసి జిల్లా కో-ఆర్డినేటర్ గగన్, ఎంపీవో ప్రభాకర్ చారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా నూతన ఆలోచనలతో కొత్తగా పరికరాలు తయారుచేయడం, ఆవిష్కరణలు రూపొందించేవారు తగిన వీడియోలు, ఫొటోలను వచ్చేనెల 3వ తేదీలోపు జీపీ కార్యదర్శులకు గాని, మండల పరిషత్ కార్యాలయంలోగాని అందించాలన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: ఎస్సారెస్పీలోకి బుధవారం 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ఒక్కరోజు వ్యవధిలో 0.5 అడుగుల నీటిమట్టం పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు(80 టీఎంసీలు) కాగా బుధవారం రాత్రి వరకు 1,071.30 అడుగుల(25.4 టీఎంసీలు) నీరుంది.

రుణం మాఫీ అయ్యేనా?

ప్రభుత్వం రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడంతో ఆనందించిన అన్నదాతలకు.. ఆ మురిపెం ఎంతోసేపు నిలవలేదు. జిల్లాలో వేలాది మందికి పంట రుణం మాఫీ కాలేదు. రూ. లక్షలోపు రుణమే తీసుకున్నా మాఫీ కాకపోవడంతో చాలామంది ఆందోళన చెందుతున్నారు. సాంకేతిక కారణాలను సాకుగా చూపి అన్యాయం చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- సాంకేతిక సమస్యలతో వేలాది మందికి అందని లబ్ధి
- గ్రీవెన్స్ సెల్‌కు 239 ఫిర్యాదులు..
- సమస్య పరిష్కరించి, రుణం మాఫీ చేయాలని కోరుతున్న అన్నదాతలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో 1,98,374 మంది రైతులు బ్యాంకుల్లో పంటరుణాలు తీసుకున్నారు. వీరందరికీ రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలంటే రూ. 1,283.14 కోట్ల నిధులు అవసరం అవుతాయి. ఇందులో రూ. లక్షలోపు రుణాలు పొందిన రైతులు 1.01 లక్షల మంది ఉన్నారు. కానీ ప్రభుత్వం మొదటి విడతలో ప్రకటించిన జాబితాలో 49,540 మంది రైతుల పేర్లు మాత్రమే ఉన్నాయి. ఈ జాబితాలో పేర్లున్నవారిలోనూ కొందరికి మాఫీ సొమ్ము ఖాతాల్లో జమ కాలేదు. దీంతో రుణమాఫీ కాని రైతులంతా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వ్యవసాయ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు వచ్చి తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటివరకు గ్రీవెన్స్ సెల్‌లో 239 ఫిర్యాదులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు.

29 రకాల కారణాలు..

పంట రుణం మాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారులను కలుస్తున్నారు. వారు ఆన్‌లైన్‌లో వివరాలను పరిశీలించి మాఫీ ఎందుకు కాలేదో చెబుతున్నారు. పట్టాదారు పాస్ పుస్తకంలో తప్పిదాలతో చాలామందికి రుణమాఫీ లబ్ధి చేకూరలేదని తెలుస్తోంది. అలాగే ఆధార్‌లోని పేరు, రుణ ఖాతాలో పేరు వేరువేరుగా ఉండడం, రైతు పేరిట తెల్ల రేషన్ కార్డు లేకపోవడం, ఓవర్ డ్యూ ఇంట్రెస్ట్, పట్టా పాస్ పుస్తకం లేకుండా లోన్ తీసుకోవడం, కుటుంబంలో మినహాయింపు లేని ప్రభుత్వ ఉద్యోగి ఉండడం, కుటుంబంలో మినహాయింపు లేని సర్వీస్ పింఛన్‌దారు ఉండడం.. ఇలా 29 రకాల కారణాలతో రుణమాఫీ కాలేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇలాంటి సాంకేతిక కారణాలతో జాబితాలో పేరు వచ్చినా కూడా అనేక మంది రైతులు రుణమాఫీ లబ్ధికి దూరంగా ఉన్నారు. సమస్యలను పరిష్కరించి రుణం మాఫీ అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మాఫీ కాలేదు..



నా భర్త పేరిట భూమి ఉంది. ఆయన ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లడంతో నామినీ కింద బ్యాంకులో రూ.90 వేల పంట రుణం తీసుకున్నం. ఇప్పుడు రుణగ్రహీత పేరిట భూమి లేదంటూ మాఫీ ఆపేశారు. రుణమాఫీ అయ్యేలా చూడాలి.

– రాగుల భాగ్య, మాచారెడ్డి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నాం



పంట రుణాలు మాఫీ కాలేదని పలువురు రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. మా దృష్టికి వస్తున్న సమస్యలు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మేం నడుచుకుంటాం.

– భాగ్యలక్ష్మి, డీఏవో, కామారెడ్డి

ప్రజలను అప్రమత్తం చేయండి

- వర్షాలతో ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టండి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: భారీ వర్షాల కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరినీ అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో భారీ వర్షాలు, ధరణి, ల్యాండ్ అక్విజిషన్, సీఎం గ్రీవెన్స్, పెండింగ్ ఫిర్యాదులు, ప్రభుత్వ భూముల సంరక్షణ, ధ్రువీకరణ పత్రాల జారీ, విపత్తుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య తదితర శాఖల అధికారులతో కలిసి మండల స్థాయి సమావేశాలను నిర్వహించి, అందరినీ అప్రమత్తం చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించడానికి సిబ్బందిని సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 3,500 లకుపైగా ధరణి దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. భూమి కొలతల కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి కొలతలు పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలు, కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

'శిథిలావస్థలో ఉన్న ఇళ్లను తొలగించాలి'



టేక్రియాల్‌లో పాత ఇంటిని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ సుజాత

కామారెడ్డి రూరల్: కూలడానికి సిద్ధంగా ఉన్న, సగం కూలిపోయిన ఇళ్లను వెంటనే తొలగించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అధికారులకు సూచించారు. బుధవారం ఆమె టేక్రియాల్‌లో పర్యటించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్నవాటిని తొలగించాలని సూచించారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలన్నారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్ శంకర్‌రావు, నాయకులు పాత శివకృష్ణమూర్తి, చాట్ల వంశి, అంజాద్, సాయిబాబా, పంపరి శీను, రవి పాటిల్, పండు, శ్రీకాంత్, ఒడ్డెం సందీప్, చిట్టిబాబు, సుంకరి శ్రీనివాస్ బొట్టు, కుర్మ మహిపాల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచంపట్టిన మల్లూర్



జ్వర పీడితులను పరీక్షించి మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది

- ప్రబలుతున్న చికున్ గున్యా
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు

నిజాంసాగర్: తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులతో మల్లూర్‌వాసులు మంచం పడుతున్నారు. రెండు, మూడు రోజులుగా జ్వరాల బారిన పడిన రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు బుధవారం మల్లూర్ గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయించారు. జ్వరాల బారిన పడినవారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు మందులను పంపిణీ చేశారు. జ్వరాలతో బాధపడుతున్నవారి ఇళ్లకు వెళ్లి వైద్యం అందించారు. గ్రామంలో 25 మంది జ్వరాల బారిన పడ్డారని, ఇందులో 15 మందిలో చికున్ గున్యా లక్షణాలు కనిపించాయని వైద్యులు తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేసి, వ్యాధుల నిర్ధారణకు అనుగుణంగా వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు.



ఇంటింటికి వెళ్లి వివరాలను తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది

'మధ్యాహ్నం'పై ధరాఘాతం

- కొండెక్కిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు
- సకాలంలో అందని బిల్లులు
- ఇబ్బంది పడుతున్న ఏజెన్సీల నిర్వాహకులు



బీబీపేటలో మధ్యాహ్న భోజనాన్ని వండుతున్న ఏజెన్సీ నిర్వాహకులు

బీబీపేట: నిత్యావసరాలు, కూరగాయల ధరలు కొండెక్కడంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు సకాలంలో అందని బిల్లులు.. మరోవైపు పెరిగిన ధరలతో ఏజెన్సీ నిర్వహణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలకు అనుగుణంగా స్లాబ్ రేట్ పెంచాలని, సకాలంలో బిల్లులు ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఆకలి తీర్చడం కోసం సర్కారు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. ఐదో తరగతిలోపు విద్యార్థులకు ఒక్కొక్కరికి భోజనం అందించినందుకు ఏజెన్సీ నిర్వాహకులకు ప్రభుత్వం రూ.5.45 చొప్పున అందిస్తోంది. 6 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు రూ.8.17 చొప్పున, 9, 10 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10.67 చొప్పున చెల్లిస్తోంది. ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు వారానికి మూడుసార్లు కోడి గుడ్డు, నిత్యం కూరగాయలతో కూడిన పౌష్టికాహారం అందించాల్సి ఉంటుంది.

అడ్డగోలుగా పెరిగిన ధరలు..

నిత్యావసరాలతో పాటు కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. మార్కెట్‌లో కిలో టమాట ధర రూ. 50 నుంచి రూ. 70 వరకు పలుకుతోంది. కేజీ పచ్చి మిర్చి ధర రూ. 80, ఉల్లి ధర రూ. 50 ఉన్నాయి. ఏ కూరగాయ ధర చూసినా కిలోకు రూ. 60కి తక్కువ లేదు. ఆకు కూరల ధరలదీ ఇదే దారి.. ఒక గుడ్డు ధర రూ.7 ఉంది. పప్పుల ధరలు కిలోకు రూ. 150 నుంచి రూ. 190 వరకు పలుకుతున్నాయి. ధరలలా మండిపోతున్నా ప్రభుత్వం మాత్రం స్లాబ్ రేటు పెంచడం లేదు. దీంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

పెండింగ్‌లో బిల్లులు..

ఓవైపు పెరిగిన ధరలు ఇబ్బంది పెడుతుంటే.. మరోవైపు సకాలంలో బిల్లులు అందక ఏజెన్సీల నిర్వాహకులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. జిల్లాలో 2 నెలలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గౌరవ వేతనం కూడా అందడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

నష్టపోతున్నాం



కూరగాయలు, పప్పు దినుసుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ ధరలతో ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదు. మధ్యాహ్న భోజనం వండిపెడుతూ నష్టపోతున్నాం. బిల్లులు కూడా సకాలంలో రాక అప్పుల పాలవుతున్నాం. ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేయాలి. స్లాబ్ రేటు పెంచాలి.

– ఇందిర, ఏజెన్సీ నిర్వాహకురాలు, బీబీపేట

గిట్టుబాటు కావడం లేదు



ప్రభుత్వం చెల్లిస్తున్న డబ్బులకు, మార్కెట్‌లో ఉన్న కూరగాయలు, ఇతర నిత్యావసర ధరలకు చాలా వ్యత్యాసం ఉంది. గిట్టుబాటు కాకపోయినా మెనూ ప్రకారం వండక తప్పడం లేదు. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలి.

– రాజు, ఏజెన్సీ నిర్వాహకుడు, మల్కాపూర్

బీమాతో రైతు కుటుంబాలకు ధీమా

- కొత్త రైతులకు అవకాశం
- రైతు వేదికల్లో దరఖాస్తుల స్వీకరణ



కామారెడ్డి రూరల్: వ్యవసాయంపై ఆధారపడ్డ అన్నదాతల కుటుంబాలకు రైతుబీమా పథకం చేదోడుగా నిలుస్తుంది. పెద్ద దిక్కు అకస్మాత్తుగా ఎదైనా కారణంతో చనిపోతే ఆ కుటుంబమంతా రోడ్డున పడుతుంది. ఏమీ చేయలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుంది. ఇలాంటి వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని అమలు చేస్తోంది. 2018 ఆగస్టు 14న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని ప్రారంభించింది. 18 నుంచి 59 సంవత్సరాల్లోపు రైతులకు ప్రభుత్వమే ఎల్ఐసీ సామూహిక బీమా చేయించి ప్రీమియం చెల్లిస్తోంది. రైతు ఏదైనా కారణంతో మృతి చెందితే కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లిస్తారు. కామారెడ్డి మండలంలో మొత్తం 16,063 మంది రైతులు ఉండగా బీమాకు 10,064 మంది అర్హులుగా ఉన్నారు. ఇప్పటి వరకు మొత్తం 55 మంది రైతులు మృతి చెందారు. వీరిలో 43 మంది రైతుల కుటుంబాలకు రూ. 2 కోట్ల 15 లక్షల పరిహారం చెల్లించారు. ఇంకా మరో పన్నెండు కుటుంబాలకు పరిహారం మంజూరు కావాల్సి ఉంది. ప్రతి ఏటా రైతు బీమా పథకంలో నమోదవుతున్న రైతుల సంఖ్య పెరుగుతున్నా పలు కారణాలతో అర్హులైన రైతులకు అవకాశం లేకుండా పోతుంది.

ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలి

రైతుబీమా పథకం గడువు ఆగస్టు 15 వరకు ఉంది. కొత్త రైతుల నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కొత్తగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు ఆగస్టు 5లోగా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి. పాతవారికి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రెన్యూవల్ చేస్తుంది. ఆయా క్లస్టర్లలోని రైతు వేదికల్లో ఏఈవోలు కొత్త రైతుల నుంచి బీమా కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు. ధరణి పోర్టల్ ద్వారా 28 జూన్ 2024 లోపు పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. పట్టాదారు పాసుపుస్తకాలున్నా.. గతేడాది బీమాలో నమోదు చేసుకోని రైతులకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది.

ఏఈవోలను సంప్రదించాలి



రైతు బీమాకు అర్హులైన రైతులందరూ నిర్ణీత గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసు పుస్తకం, పట్టాదారు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో సంబంధిత ఏఈవోలకు దరఖాస్తులివ్వాలి.

– శ్రీనివాస్‌రావు, మండల వ్యవసాయాధికారి, కామారెడ్డి

'రుణమాఫీ సొమ్ము రైతులకే చెల్లిస్తాం'

సదాశివనగర్: గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు నాటిన రైతులకు ఇస్తున్న రుణాలకు సంబంధించిన మాఫీ సొమ్మును వారికే అందిస్తామని ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. బుధవారం ఆయన అడ్లూర్ ఎల్లారెడ్డిలోని గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీలో విలేకరులతో మాట్లాడారు. గాయత్రి షుగర్స్ యాజమాన్యం 2003 సంవత్సరం నుంచి చెరుకు నాటిన రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అప్పుగా అందిస్తోందన్నారు. ఇందుకోసం నిజామాబాద్ యూనియన్ బ్యాంక్‌తో గతంలో ఒప్పందం చేసుకున్నామన్నారు. ప్రస్తుతం షుగర్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో 2,600 మంది రైతులకు రూ. 19 కోట్ల వరకు రుణాలు అందించామన్నారు. గత ప్రభుత్వాలు రుణమాఫీ సందర్భంగా బ్యాంకుల నుంచి వివరాలు కోరాయని, నిజామాబాద్ యూనియన్ బ్యాంక్ నుంచి కమర్షియల్ కార్పొరేషన్ రుణాల పేరుతో అప్పు తీసుకున్నందున అప్పట్లో రుణమాఫీ వర్తించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈకేవైసీ ఆధార్ సీడింగ్ ద్వారా రైతు సమాచారం సేకరించిందని, దీంతో ఫ్యాక్టరీ ద్వారా పొందిన రుణాలు కూడా మాఫీ అవుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు ఎంతమొత్తం మాఫీ అయ్యిందో ఆ సొమ్మును వారికే చెల్లిస్తామన్నారు. సమావేశంలో ఫ్యాక్టరీ డీజీఎం మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామారెడ్డి అర్బన్: దోమకొండ 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పాల్వంచ, మాచారెడ్డి మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ సాలియానాయక్ తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు కరెంట్ ఉండదని, చుక్కాపూర్, లచ్చాపేట, జగ్గానాయక్ తండా, భవానీపేట, ఆరేపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

డిగ్రీ ఫలితాల్లో ప్రతిభ


సల్మాఫాతిమా

కామారెడ్డి అర్బన్: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో కామారెడ్డి వశిష్ట డిగ్రీ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించినట్లు సీఈవో హరిస్మరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అనిల్‌రెడ్డి తెలిపారు. బీకాంలో సల్మాఫాతిమా 10 ఎస్‌జీపీఏ, సానియా సమ్రిన్ 9.48, సలేహా మటీన్ 9.40 పొందగా, బీటీబీసీ కోర్సులో నగ్మా సిద్ధిక 9.52, మధుప్రియ 9.40,బీజెడ్‌సీలో కె వైష్ణవి 9.36 సాధించారని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు

కామారెడ్డి అర్బన్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల పేరుతో ఎంఈఓలు ఇష్టానుసారంగా నిబంధనలు ఉల్లంఘించి డిప్యుటేషన్లు పెట్టిన డీఈవో మౌనంగా ఉన్నారని డీటీఎఫ్ పూర్వ జిల్లా అధ్యక్షుడు విజయరామరాజు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినా, బదిలీ అయిన వారి స్థానంలో బదులుగా మరొకరు రాకపోవడంతో అనేక మంది రిలీవ్ కాలేదని, దీంతో ఎంఈవోలు అక్రమ డిప్యుటేషన్లకు తెర లేపారని ఆరోపించారు. పని సర్దుబాటు పేరుతో అక్రమాలకు పాల్పడ్డ ఎంఈవోలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బ్యాంకు రుణాలపై అవగాహన



ఎల్లారెడ్డి: బ్యాంకు రుణాలను పొందడం ద్వారా వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవచ్చని తెలంగాణ గ్రామీణ బ్యాంకు నిజామాబాద్ సీనియర్ బిజినెస్ మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో వ్యాపారస్తులకు బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి బ్రాంచ్ మేనేజర్ సంతోష్, సిబ్బంది వంశీ, ప్రశాంత్ తదితరులున్నారు.

పాత ఏజెన్సీలకే కాంట్రాక్ట్ పొడిగింపు

- వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో పాతవారే కొనసాగింపు
- మరో ఏడాది కాలానికి బాధ్యతల అప్పగింత



మోర్తాడ్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రి

మోర్తాడ్(బాల్కొండ): వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో సెక్యూరిటీ, సానిటేషన్, పేషెంట్ కేర్ టేకర్ విభాగాల సిబ్బంది నియామకం, అజమాయిషీ కోసం ఏజెన్సీలకు కాంట్రాక్ట్ ఇచ్చిన ప్రభుత్వం పాత ఏజెన్సీలకే మరో ఏడాది కాంట్రాక్టను రెన్యువల్ చేసింది. ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించకుండా ఏజెన్సీల ద్వారా మూడు రకాల సేవలను నిర్వహించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. 30 పడకల ఆస్పత్రుల్లో 13 మంది, జిల్లా జనరల్ ఆస్పత్రిలో 200 మంది, 100 పడకల ఆస్పత్రుల్లో 41 మంది చొప్పున సిబ్బందిని నియమించేందుకు ఏజెన్సీలకు అనుమతి ఇచ్చారు. మోర్తాడ్, బాల్కొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, కోటగిరి, వర్ని, నవీపేట్‌లో 30 పడకల, బోధన్, ఆర్మూర్‌లో 100 పడకల ఆస్పత్రులు ఉండగా, భీమ్‌గల్‌లో భవన నిర్మాణం పూర్తి కాలేదు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో నిబంధనల ప్రకారం 200 మంది ఉద్యోగులను ఏజెన్సీ నిర్వాహకులు నియమించారు. వంద పడకల ఆస్పత్రుల్లో 41 మందికి బదులు 20 మందిని, 30 పడకల ఆస్పత్రుల్లో 13 మందికి బదులు 7 నుంచి 8 మందిని నియమించుకుని వారితోనే సేవలను వెళ్లదీశారు. ఏజెన్సీలు రాజకీయ పార్టీ నాయకుల గుప్పిట్లో ఉండటంతో బిల్లులు చేయడంలో అధికారులు ఒత్తిడికి తలొగ్గాల్సి వచ్చింది. వైద్య విధాన పరిషత్ అధికారులు మౌన పాత్రకు పరిమితమయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఏజెన్సీలను మార్చాలని ఉన్నతాధికారులు నిర్ణయానికి వచ్చి జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు దృష్టికి తీసుకువెళ్లారు. అయితే, పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఇతర కారణాలతో ఏజెన్సీల మార్పుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే ఏజెన్సీలు నడుపుతున్న నాయకులు సైతం పార్టీ మారారని, ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తీసుకువచ్చి పాత ఏజెన్సీలకే కాంట్రాక్ట్ పొడిగించేలా చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. రెండేళ్ల కాంట్రాక్ట్ ముగిసిపోవడంతో కొత్తగా టెండర్ నిర్వహించాల్సి ఉంది. మళ్లీ టెండర్లు నిర్వహిస్తే తమ ఏజెన్సీలకు కాంట్రాక్టు దక్కుతుందో లేదో అనే సందేహంతో నిర్వాహకులు పాత వాటికే కాంట్రాక్టు పొడిగించేలా ప్రభుత్వంతో ఆదేశాలు జారీ చేయించుకున్నారని పలువురు పేర్కొంటున్నారు.

నిబంధనల్లో మార్పులు

తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని కాంట్రాక్ట్ రెన్యువల్ చేసుకున్న ఏజెన్సీలకు అధికార యంత్రాంగం నిబంధనలను సవరించి చుక్కలు చూయిస్తుండటం విశేషం. సెక్యూరిటీ, సానిటేషన్, పేషెంట్ కేర్‌టేకరింగ్‌కు ఎంత మంది ఉద్యోగులు పని చేస్తే అంతే మందికి వేతనాలు చెల్లించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. గతంలో మాదిరిగా తక్కువ మంది పని చేసినా ఎక్కువ మందికి వేతనాల బిల్లు చెల్లించే విధానానికి స్వస్తి పలికారు. దీంతో ఏజెన్సీల ఆటకు అధికారులు అడ్డుకట్ట వేశారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీల ఆటకట్టించడంలో అధికారులు సఫలీకృతులయ్యారని అంటున్నారు.

కాంట్రాక్ట్ రెన్యూవల్ చేశాం

ఆస్పత్రుల్లోని మూడు విభాగాల్లో సేవలందించే ఉద్యోగులను నియమించుకున్న ఏజెన్సీలకు ఒక ఏడాది కాంట్రాక్ట్ రెన్యువల్ చేశాం. ఉద్యోగుల సంఖ్య, వారి హాజరు శాతం ఆధారంగానే బిల్లులు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. నిధులు పక్కదారి పట్టకుండా చూస్తున్నాం.

– డాక్టర్ శివశంకర్, డీసీహెచ్‌వో

సమయపాలన పాటించని అధికారులు


ఎంపీడీవో ఆఫీస్ తాళం తీయకపోవడంతో తిరిగి వెళ్లిపోతున్న ఎంపీవో అనిత

నిజాంసాగర్: నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఉదయం పది గంటలైనా నిజాంసాగర్ మండల పరిషత్, మహమ్మద్ నగర్ తహసీల్దార్ కార్యాలయాలు తెరుచుకోలేదు. బుధవారం ఉదయం 10 గంటలకు మండల పంచాయతీ అధికారిని అనిత మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికి తాళాలు తెరవకపోవడంతో ఆమె వెనుతిరిగి వెళ్లిపోయారు. అలాగే మహమ్మద్ నగర్ తహసీల్దార్ క్రాంతికుమార్‌తో పాటు ఉద్యోగులు, సిబ్బంది సమయానికి హాజరుకావడం లేదు.

జీపీ కార్యదర్శికి సన్మానం



భిక్కనూరు : మండలంలోని సిద్దరామేశ్వరనగర్ జీపీ కార్యదర్శిగా ఐదేళ్లు పనిచేసి ర్యాగట్లపల్లి గ్రామానికి బదిలీ పై వెళ్తున్న సౌజన్య గ్రామాభివృద్ధికి కృషి చేశారని మాజీ సర్పంచ్ జనగామ శ్రీనివాస్ అన్నారు. బుధవారం గ్రామంలోని వీడీసీ కార్యాలయంలో సౌజన్యను సన్మానించి మెమెంటోను అందజేశారు. నేతలు ప్రభాకర శర్మ, బోనాల శ్రీనివాస్, గజ్వేల్లీ దుర్గబాబు, యాదగిరి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

దూప్‌సింగ్‌తండాలో..



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని దూప్‌సింగ్ తండా పంచాయతీలో బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి రాజును బుధవారం గ్రామ ప్రజలు సన్మానించారు. మాజీ సర్పంచ్ చందర్ రాథోడ్ నాయకులు శ్రీనివాస్, హెచ్‌ఎం సాయినాథ్ ఉన్నారు.

అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా కార్యవర్గం ఎన్నిక



బాన్సువాడ: అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా కార్యవర్గాన్ని బుధవారం బీర్కూర్‌లో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి, రాష్ట్ర కమిటీ కోశాధికారి పోతుగంటి గంగాధర్, అబ్జార్వర్ భాస్కర్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్రి సుధాకర్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా కె గంగాధర్, కార్యదర్శిగా గుడికొండ సుభాష్, కోశాధికారిగా కృష్ణ, ఈసీ మెంబర్లుగా మాదప్ప, సిద్దు, వలంటీర్‌గా చంద్రశేఖర్, పీఆర్వోగా లక్ష్మణ్, మల్లేష్ పటేల్, రాజు, శివరామ కృష్ణ తదితరులను ఎన్నుకున్నారు.

పశువులకు అందని వైద్యం


పెద్దకొడప్‌గల్‌లో మూసి ఉన్న పశువైద్యశాల

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలో పశువులకు వైద్యం అందడం లేదు. గ్రామంలోని పశు వైద్యశాల ఎప్పుడు చూసినా మూసే ఉంటుంది. దీంతో పశువులకు వైద్యం చేయించడానికి వచ్చిన ప్రజలు వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. పశువైద్యుడికి మూడు చోట్ల ఇన్‌చార్జి బాధ్యతలు ఉన్నాయి. అటెండర్లు, స్వీపర్లు కూడా లేరు. పశువులకు వైద్యం అందించే వారు కరువయ్యారు. దీంతో రైతులు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో పశువైద్యుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



బాన్సువాడ రూరల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ సీఐ కృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని బోర్లం జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్‌క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. ఫోన్‌లకు వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని, ఓటీపీ, పాస్‌వర్డ్ ఇతరులతో షేర్ చేసుకోరాదన్నారు. చిన్నపిల్లలను, మహిళలను వేధిస్తే పోక్సో చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు మూఢనమ్మకాలను విశ్వసించొద్దని, శాస్త్రీయంగా ఆలోచించాలని సూచించారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సరిత, కురుమ గంగాధర్, నర్సింహచారి, ఆనంద్, రాజు, సంగమేశ్వర్, శ్రావణ్, తేజ, జ్యోతి పాల్గొన్నారు.

కేజీబీవీలో ఖాళీ పోస్టుల భర్తీ

నిజామాబాద్‌అర్బన్: కేజీబీవీలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి కొన్ని పోస్టులను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. మిగతా పోస్టులను భర్తీ చేసేందుకు మళ్లీ సబ్జెక్టుల వారీగా మెరిట్ లిస్టును జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు ఈనెల 25, 26 తేదీల్లో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు.

కూలిన ఇంటిని పరిశీలించిన తహసీల్దార్



మద్నూర్(జుక్కల్): మండలంలోని లచ్చన్‌లో మూడు రోజుల క్రితం వర్షానికి కూలిపోయిన ఇంటిని బుధవారం తహసీల్దార్ ముజీబ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ నెల 21న అర్ధరాత్రి మీరేవార్ చాందు, సురేష్ ఇల్లు భారీ వర్షానికి కూలిపోయింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. జరిగిన నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తహసీల్దార్ పేర్కొన్నారు.

నేడు 'సౌందర్య లహరి సౌందర్యం' ఆవిష్కరణ

కామారెడ్డి అర్బన్: అష్టావధాని డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ రాసిన 'సౌందర్య లహరి సౌందర్యం' పరిశోధన గ్రంథాన్ని గురువారం సాయంత్రం 4గంటలకు జూమ్ యాప్ ద్వారా డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ ఆవిష్కరించనున్నారు. 25న మధ్యాహ్నం 3గంటల నుంచి సౌందర్య లహరీ సౌందర్యం పారాయణం, ఆవిష్కరణ, ఆధ్యాత్మిక వేత్తల సందేశాలను దర్శనం ఛానల్ ద్వారా తిలకించవచ్చని రచయిత నటేశ్వరశర్మ పేర్కొన్నారు.

గురుకుల కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్స్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్):నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లలో ప్రవేశానికి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయాధికారులు ఎం.సత్యనారాయణ, నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2024లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినుల (బాలికల)కు ఈనెల 26న ఉదయం 10 గంటలకు డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల (సీవోఈ)లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. అలాగే విద్యార్థుల (బాలుర)కు 27వ తేదీన భిక్కనూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీజీ పరీక్షలకు11 మంది గైర్హాజరు


తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్, పీజీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు బుధవారం 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, న్యాయ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పీజీ ఇంటిగ్రేటెడ్ 6,7,8,9,10వ సెమిస్టర్, పీజీ 1,3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 14 మంది విద్యార్థులకు గాను 14 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 142 మందికి గాను 131 మంది హాజరైనట్లు వివరించారు.

బ్యాక్‌లాగ్ పరీక్షలు..

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం చాన్స్ బ్యాక్‌లాగ్ 5, 6వ సెమిస్టర్ పరీక్షలకు బుధవారం ప్రశాంతంగా కొనసాగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్ (కామారెడ్డి), ఎస్ఆర్ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (ఆర్మూర్) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 83 విద్యార్థులకుగాను 80 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు ముగ్గురు విద్యార్థులకు గాను ముగ్గురు హాజరయ్యారని తెలిపారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు..

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మే 21 నుంచి జూన్ 15వరకు నిర్వహించిన డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల రీవాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ ఎం అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో పేపర్‌కు రూ.500 ఫీజు చెల్లించి ఆగస్టు 3నుంచి 5వ తేదీ వరకు రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



క్రైం కార్నర్

తండ్రి హత్య కేసులో జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: తండ్రిని హత్య చేసిన కేసులో కొడుకుకి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ తీర్పు వెలువరించారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. 2021 మార్చి 9వ తేదీన క్యాసంపల్లి తండాకు చెందిన భూక్యా ఫకీరా(65) ఉగ్రవాయి శివారులో హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఫకీరాను హత్య చేసి చెట్టుకు ఉరివేసుకున్నట్లు నమ్మించే ప్రయత్నం చేయడంతో మృతుడి తమ్ముడి కొడుకు భూక్యా హుస్సేన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న దేవునిపల్లి పోలీసులు మృతుని కుమారుడు భూక్యా భాషాను అదుపులోకి తీసుకుని విచారించగా.. డబ్బుల విషయంలో గొడవల కారణంగా తండ్రిని తానే హత్య చేసినట్లు నేరం అంగీకరించాడు. కేసు కోర్టులో ఉండగా, బుధవారం కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి.. నిందితుడికి జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసు విచారణ చేపట్టిన అప్పటి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్‌గౌడ్, సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత రూరల్ సీఐ రామన్, ఎస్సై రాజు, కోర్టు కానిస్టేబుళ్లు బాలకృష్ణ, దేవిచంద్‌ను ఎస్పీ సింధుశర్మ అభినందించారు.

భార్యపై హత్యాయత్నం కేసులో ఐదేళ్లు..

భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు కామారెడ్డి కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. లింగంపేట మండలం పోతాయిపల్లికి చెందిన గారబోయిన చిన్న సంగయ్య ఏడాది క్రితం అతని భార్యను మానసికంగా, శారీరకంగా వేధించడంతోపాటు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన కామారెడ్డి కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి టి నాగరాణి.. నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వేయి జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. కేసును విచారించిన సీఐ శ్రీనివాస్, ఎస్సై చైతన్యకుమార్, పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ దామోదర్‌రెడ్డి, పోలీసు సిబ్బందిని ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

భూ ఆక్రమణపై సీపీకి ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నిమ్మచెట్లను ధ్వంసం చేయడంతోపాటు తన వ్యవసాయ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కమ్మర్‌పల్లి మండలంలోని కోనసముందర్ గ్రామానికి చెందిన కండే క్రాంతిబాలరాజ్ సీపీ కల్మేశ్వర్‌కు బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 404/21లో ఉన్న తన భూమిలోని నిమ్మచెట్లను ఈనెల 7వ తేదీన ఉదయం గ్రామానికి చెందిన నల్ల గంగాధర్‌తోపాటు అతడి కుమారుడు నల్ల సోమేలు దున్నేశారని, అడ్డు వెళ్లిన తనను ట్రాక్టర్‌తో గుద్ది చంపుతామని బెదిరించారని, కులం పేరుతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటన జరిగిన రోజునే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదని తెలిపాడు.

పేకాట స్థావరాలపై దాడులు

కామారెడ్డి క్రైం: పట్టణ పరిధిలోని లింగాపూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,12,800 నగదు, 2 కార్లు, 4 బైకులు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రామడుగులో..

ధర్పల్లి: మండలంలోని రామడుగు శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ. 2180 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బోధన్‌రూరల్: మండలంలోని ఊట్‌పల్లికి చెందిన బి సావిత్రి అనే మహిళ ఇంటి తాళాలను దుండగులు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం గ్రామంలో ఉంటున్న బంధువు మరణించగా, సావిత్రి తన ఇంటికి తాళం వేసి అంత్యక్రియలకు వెళ్లింది. బుధవారం ఉదయం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో దాచిన రూ.30వేల నగదు, 3 గ్రాముల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి రిమాండ్

బోధన్‌రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తిని పోక్సో కేసులో రిమాండ్‌కు తరలించినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను నిందితుడు బలవంతం చేశాడని, బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ నెల 22న పోక్సో కేసు నమోదు చేశామన్నారు. బుధవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామన్నారు.

లక్ష్మికాలువ ఆనకట్టకు కోతలు

- వర్షం నీటితో కోతకు గురైన ఆనకట్ట
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు


కోతకు గురైన లక్ష్మికాలువ ఆనకట్ట

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మికాలువ ఆనకట్ట కోతకు గురవుతోంది. దీంతో నీటి సరఫరా సమయంలో కాలువ ఆనకట్టకు గండి పడే ప్రమాదం ఉంది. కాలువ లైనింగ్ పూర్తిగా ధ్వంసమైంది. ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు రావడంతో ఆనకట్ట మొత్తం కోతకు గురైంది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మికాలువ ఆనకట్టకు ఇరువైపులా ఏపుగా చెట్లు పెరిగాయి. చెట్లను తొలిగించడంలో అధికారులు యంత్రాన్ని వినియోగించారు. యంత్రం సహాయంతో వేర్ల నుంచి చెట్లనుతొలిగించారు. దీంతో వేర్ల ద్వారా సిమెంట్ లైనింగ్ పూర్తిగా ధ్వంసమైంది. అంతే కాకుండా కాలువ ఆనకట్ట వదులు కావడం, వర్షం కురవడంతో పూర్తిగా కోతకు గురైంది. అధికారులు చెట్లను వేర్ల నుంచి తొలిగించకుండా వాటిని కోసి ఉంటే పరిస్థితి ఇంత దారుణంగా ఉండేది కాదని రైతులు అంటున్నారు. ముప్కాల్ మండలం నల్లూర్ శివారులో నిర్మిస్తున్న సైఫన్ కోసం నీటిని వేరే చోటు నుంచి మళ్లించేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో ఎగువ నుంచి భారీ వర్షపు నీరు వచ్చి సైఫన్ నిర్మాణం వద్ద గండి ఏర్పడింది. ఆనకట్టను బలోపేతం చేసేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. కాలువ కోతకు గురి కావడంతో ఆనకట్ట మట్టి, మొరం అంతా కాలువలో కుప్పలుకుప్పలుగా పేరుకు పోయి నీటి ప్రవాహానికి అడ్డుగా మారింది.

అటవీ బేస్ క్యాంప్ సిబ్బందిపై దాడి

నిందితులపై కేసు నమోదు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి అటవీ క్షేత్రం పరిధిలోని బేస్ క్యాంప్ సిబ్బందిపై దాడి చేసిన నర్సాపూర్‌కు చెందిన ముగ్గురిపై కేసు నమోదైంది. ఎఫ్ఆర్‌వో రవీందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బషీరాబాద్ బీట్ పరిధిలోని కోనసముందర్ అటవీ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి నర్సాపూర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు జేసీబీతో అటవీభూమిని చదును చేస్తున్నారని సమాచారం అందడంతో సెక్షన్ ఆఫీసర్ రాజు, బీట్ ఆఫీసర్ సునీత, తిరుపతి వెళ్లారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో నుంచి బయటకు వస్తున్న జేసీబీని విచారణ కోసం అటవీ అధికారులు ఆపేందుకు ప్రయత్నించగా, ఆపకుండా సదరు వ్యక్తులు నర్సాపూర్‌వైపు వెళ్లారు.

బేస్ క్యాంపు సిబ్బందికి సమాచారం అందించగా, వారు చేరుకొని జేసీబీని నిలిపివేశారు. వాహనంలో నుంచి కిందికి దిగిన ముగ్గురు వ్యక్తులు బేస్ క్యాంపు సిబ్బందిపై దాడి చేయగా, వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అబ్దుల్ ముజాహిద్, గఫార్ అబ్దుల్, జావిద్ అబ్దుల్ జుబేదార్ జేసీబీలో ఉన్నట్లు గుర్తించారు. ఎఫ్ఆర్‌వో ఫిర్యాదు మేరకు పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. నిందితులపై గతేడాది అటవీ భూమి ఆక్రమణ కేసు నమోదై ఉందని తెలిపారు.

గుట్కా పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టాస్క్ ఫోర్స్, పోలీసులు బుధవారం సాయంత్రం సంయుక్తంగా దాడి చేసి రూ.లక్ష విలువైన గుట్కాను పట్టుకున్నారు. వాహనంలో గుట్కా తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేశారు.

తల్లిపై దాడి.. కేసు నమోదు

ఎల్లారెడ్డి: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన భాగీర్థపై ఆమె కుమారుడు జైపాల్ దాడి చేసి గాయపరిచినట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. జైపాల్ తరుచు మద్యం సేవించి వస్తుండడంతో తల్లి మందలించిందని, దీంతో ఆమెపై దాడి చేశాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆమె కొడుకుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.